కళ్యాణమంటపంలో అడుగిడిన వాళ్లంతా వధూవరులను చూసి 'చూడ చక్కని జంట' అనుకోకుండా ఉండలేకపోతున్నారు. కీర్తిక-రాజీవ్ ఇరువురూ పాతికేళ్లలోపువారే. అందం-చందం, చదువు-ఐశ్వర్యంలో వారిరువురూ ఎవరికి వారే సరిజోడు. కళ్యాణ తంతు దాదాపుగా ముగిసింది. వచ్చిన అతిథులంతా వధూవరులను ఆశీర్వదించి ఒకరొకరుగా వెళ్ళిపోతున్నారు. పెళ్లిమంటపం దాదాపుగా ఖాళీ అయిపోయింది. కళ్యాణమంటపంలో ఒక మూల కొత్త పెళ్ళి కూతురు, పెళ్లికొడుకు ఏవో జోక్స్ చెప్పుకుంటూ చిన్నగా నవ్వుకుంటున్నారు. ఇతరులతో సంబంధం లేనట్లుగా మా ప్రపంచమే వేరు అన్నట్లున్నారు వాళ్ళు.

వధూవరులకు కాస్త దూరంగా కుర్చీలో కూర్చుని కునికిపాట్లు పడుతున్నారు కృష్ణమూర్తిగారు. గత రెండుమూడు నెలల నుంచి కూతురి పెళ్లి ఏర్పాట్లలో తలమునకలై శారీరకంగా, మానసికంగా బాగా అలసిపోయారాయన. మగ సంతతి లేకపోవడం వల్ల అన్ని పనులు ఆయన భుజాలపై పడడం వల్ల అధికశ్రమ, పెనుభారం ఆయనకు తప్పలేదు.

చిరుద్యోగి కృష్ణమూర్తి సంపాదన అంతంతమాత్రంగా ఉండేది. మగని మనసెరిగిన ఇల్లాలు కామేశ్వరి కాపురాన్ని ఎంతో పొదుపుగా, గుట్టుగా సాగించేది. వేణ్ణీళ్లకి చన్నీళ్ళు తోడు అన్నట్టుగా తాను చిన్ననాటి నుంచీ నేర్చుకున్న సంగీతపాఠాలు పిల్లలకు నేర్పిస్తూ కాస్తోకూస్తో సంపాదన కూర్చేదామె.

పెద్దవాళ్ళ కష్టం ఎరిగి పిల్లలు మసలుకునేవారు. చదువుల్లో చక్కని ప్రతిభ కనబరచి స్కాలర్‌షిప్పులు సాధించేవారు. సినిమాలకు, షికార్లకు తీసుకెళ్లమని మారాం చేసేవారు కాదు. లేమిలో ఉన్నా లేనివాళ్లుగా కనిపించేవారు కాదు. తమకున్నంతలో శుచిగా, శుభ్రంగా ఉండేవాళ్ళు. పెద్దమ్మాయి కమల డిగ్రీ చదువుతున్నప్పుడు మంచి సంబంధం రావడంతో మావగారి సాయంతో పెళ్లి జరిపించాడు కృష్ణమూర్తి. ఆ తర్వాత రెండేళ్లకు రెండో అమ్మాయి పెళ్లి కూడా జరిగిపోయింది. మూడో అమ్మాయి కీర్తిక చదువుల్లో అక్కలిద్దరికన్నా మేటి. ఎంసెట్‌లో మంచి ర్యాంక్ రావడంతో ఒక కోచింగ్‌సెంటర్ వాళ్ళు ముందుకొచ్చి మెడిసిన్ చదువుకు అయ్యే మొత్తం ఖర్చులన్నీ తామే భరిస్తామని చెప్పి తమ కోచింగ్ ఇనిస్టిట్యూట్‌లో చేర్చుకున్నారు.

# విధి విలాసం

-పి.వి.పవన్‌కుమార్



కృష్ణమూర్తి-కామేశ్వరి దంపతులకి ముగ్గురూ ఆడపిల్లలే. కమల, కోమల, కీర్తి. అందం-చందం, చదువు-సంస్కారం మూర్తీభవించిన అందాల అపరంజి బొమ్మలు వాళ్ళు.

కనీసం మూడో కాన్పులోనైనా వంశోద్ధారకుడు పుడతాడని కృష్ణమూర్తి గంపెడంత ఆశ పెట్టుకున్నాడు. ఆడపిల్ల పుట్టిందన్న వార్త వినగానే నిరాశతో కృంగిపోయాడు. అసహనంతో, ఆక్రోశంతో కొన్నాళ్లపాటు భార్యాబిడ్డల్ని చూడడానికైనా వెళ్లలేదు.

'మనోవ్యాధితో అమ్మాయి అనారోగ్యం పాలయిందనీ, కనీసం ఒక్కసారైనా చూసి వెళితే తన బిడ్డ ఆరోగ్యం కుదుటపడుతుందని' మావగారు ప్రాధేయపడి వేడుకుంటే కాదనలేక వెళ్ళాడు. కాలక్రమేణా కోపం మంచులా కరిగిపోయింది. పరిస్థితులతో రాజీపడిపోయాడు కృష్ణమూర్తి.

★ ★ ★

బంగారానికి తావి అబ్బినట్లుగా ఆమె ప్రతిభకి వారి కోచింగ్ తోడవ్వడంతో ఎంబిబియస్ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణురాలై తన చిరకాలవాంఛ నెరవేర్చుకుంది. అనతికాలంలోనే నగరంలోని ప్రముఖ గైనకాలజిస్టుల్లో ఒకరిగా వాసికెక్కింది.

కీర్తి, ప్రతిష్ఠ, అందం, ఐశ్వర్యం ఇవి అన్నీ ఒకచోట చేరితే అదృష్టం కూడా చెలిమిచేయడానికి తహతహలాడుతుంది. అపరకుబేరుడు, నగరంలోని ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్‌మోహన్ స్వయంగా ఇంటికొచ్చి తనతో వియ్యం అందేందుకు సుముఖంగా ఉన్నట్లు వెల్లడించడంతో కృష్ణమూర్తి ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. ఆనాడు ఆడపిల్ల వద్దనుకుని పుడితే చూడడానికి కూడా ఇచ్చగించనివాడు ఈరోజు ప్రేమపాశంతో కట్టిపడేసిన గారాలపట్టి తన భర్తతో పాటు విదేశాలకు వెళుతూంటే ఆవేదన చెందుతున్నాడు. విధి విలాసం అంటే ఇదేనేమో!

★